గడ్డికి గడ్డుకాలం

- యంత్రాలతో వరి కోతలు
- ఫలితంగా ఏర్పడుతున్న కొరత
- ట్రాక్టర్ గడ్డి రూ.8 వేలు

పెదపూడి: వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమ ఉంది.. పంట పండించాక వచ్చిన గడ్డి పశువులకు మేతగా ఉపయోగపడుతోంది.. అందుకే ప్రతి రైతూ పాడిని ఆధారంగా చేసుకుని ఆదాయం పొందేవారు. ప్రస్తుతం అక్కడక్కడా ఆ పరిస్థితి ఉంది. సాగులో యాంత్రీకరణ పెరగడంతో ఎండు గడ్డికి కొరత ఏర్పడుతోంది. కూలీల కొరత, వాతావరణంలో మార్పుల కారణంగా సకాలంలో పంటను దక్కించుకునే ఉద్దేశంతో యంత్రాలతో వరి కోతలు ఎక్కువగా చేపడుతున్నారు. దీంతో పశువులకు ఎండు గడ్డి లేకుండా పోతోంది. ఫలితంగా పశు పోషణకు పాడి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఎండు గడ్డికి బాగా గిరాకీ పెరిగింది. యంత్రాలతో వరి పంటను ఒబ్బిడి చేయడంతో ఎండు గడ్డి దాదాపు రైతులకు దక్కడం లేదు. అలాగే యంత్రాలతో కోసిన పొలాల్లో బాటలుగా ఉన్న ఎండు గడ్డిని పాడి రైతులు పోగేసుకుని దానిని పశువుల మకాం వద్దకు, పొలం దిమ్మలకు తరలించుకుంటున్నారు. తొలకరి గడ్డిని పాడి రైతులు పశువుల మేతకు ఎక్కువగా వినియోగించడం కూడా ఎండుగడ్డి కొరతకు ప్రధాన కారణమవుతోంది. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో అనపర్తి, పెదపూడి, బిక్కవోలు, రంగంపేట, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలు ఉన్నాయి. ఈ ఖరీఫ్‌లో 95,933 ఎకరాల్లో వరి సాగు చేశారు. సుమారు 85 శాతం మేర వరి కోతలకు యంత్రాలు వినియోగిస్తున్నట్లు అంచనా.

> **రాయితీపై విత్తనాలు**
>
> యంత్రాలతో వరి కోతలు కోయడంతో ఏర్పడే ఎండు గడ్డి కొరతను నివారించడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది. ఈ నేపథ్యంలో సంపూర్ణ సమీకృత దాణాను, జొన్న, మొక్కజొన్న, బొబ్బర్లు తదితరాలు పచ్చగడ్డి విత్తనాలు రాయితీపై అవసరమైన రైతులకు సరఫరా చేస్తున్నాం. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.
>
> –ప్రణీత్, మండల పశు వైద్యాధికారి, బిక్కవోలు


పెదపూడిలో ఎండుగడ్డిని ఒబ్బిడి చేస్తున్న రైతులు

దీనివల్ల దాదాపు 60 శాతంపైగా ఎండు గడ్డి వృథా అవుతుంది. రెండు నియోజకవర్గాల్లో గేదెలు 80,657, ఆవులు 32,420 ఉన్నాయి. సుమారు 13,200 మంది పాడి రైతులు ఉన్నట్లు అంచనా. అయితే పశువులకు సాధారణంగా రోజూ ఎండు, పచ్చగడ్డితో పాటు దాణా పెడుతుంటారు. ఒక్కరోజులో 400 కిలోల బరువు ఉన్న పశువుకు ఇంచుమించు ఐదు కిలోల ఎండుగడ్డి, 15 కిలోల పశుగ్రాసం అవసరం ఉంటుందని పశువైద్యులు చెబుతున్నారు.

అంతకంతకూ పెరిగిన ధర

ప్రస్తుతం ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రూ.8 వేలు పలుకుతోంది. పొలంలో కూలీలతో వరి కోత కోయించి ఒబ్బిడి చేసిన ఎండుగడ్డి ఎకరం ధర రూ.4,500 పలుకుతుంది. గతంలో రూ.6 వేలకు వచ్చే ఎండు గడ్డి ట్రాక్టర్ ధర భారీగా పెరిగింది. ప్రస్తుతం యంత్రంతో కోసిన ఎండుగడ్డి పొలంలో ఉంటే దాని ధర రూ.1,500 ఉంది. అలాగే ఆ ఎండుగడ్డిని పొలంలో గుట్టలుగా పోగుపెట్టడానికి, పోగుపెట్టిన గడ్డిని ట్రాక్టర్లపై, లేదా పొలం దిమ్మెలపై వేయడానికి మరో రూ.2,500 అవుతుంది. ఈ నేపథ్యంలో గిరాకీ పెరిగింది. ఎండు గడ్డిని ఆహారంగా తీసుకున్న పశువు ఇచ్చే పాలలో చిక్కదనం ఎక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ వరి గడ్డిని పశువుల దాణాతో పాటు అట్టల తయారీకి వినియోగిస్తుంటారు. యంత్రాల వినియోగం పెరిగి, అవసరమైన గడ్డి అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు.

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత


కాకినాడ జీజీహెచ్‌లో రాముడుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రామలక్ష్మి

మధురపూడి: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కోరుకొండ మండలంలో చురుగ్గా జరుగుతోంది. వలంటీర్లు శుక్రవారం తెల్లవారుజామునే లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. బుచ్చెంపేటకు చెందిన బద్దెల రాముడు కాకినాడ జీహెచ్‌లో చికిత్సపొందుతున్నాడు. దీంతో వలంటీర్ బట్టు రామలక్ష్మి ఆ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేసింది.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండలోని హరేరామ ఆలయ ప్రాంగణంలో శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఈ కార్యక్రమం నిర్వహించింది.

క్లుప్తంగా

తలుపుతట్టి.. పింఛనిచ్చి


పందలపాకలో వృద్ధురాలికి పింఛను ఇస్తున్న వలంటీర్, గృహసారథి

బిక్కవోలు: ఒకటో తేదీ కావడంతో శుక్రవారం తెల్లవారు జాము నుంచే సామాజిక పింఛన్ల పంపిణీ మొదలైంది. లబ్ధిదారుల ఇంటికి వలంటీర్లు వెళ్లి పింఛన్లు అందజేశారు. మండలంలో 10,797 మందికి పింఛన్ల సొమ్ము ఇచ్చారు.

నేడు, రేపు

ఓటు నమోదు కార్యక్రమం

బిక్కవోలు: మండలంలో శని, ఆదివారాలు ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పోసిబాబు తెలిపారు. మండలంలో 58 పోలింగ్ బూత్ వద్ద అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు.

ఉత్సాహంగా ఫ్రైడే - డ్రైడే

మధురపూడి: కోరుకొండ, కోటికేశవరం, దోసకాయలపల్లి పీహెచ్‌సీల పరిధిలో శుక్రవారం ఫ్రైడే – డ్రైడే నిర్వహించారు. భాగంగా ఏఎన్ఎం, ఆశవర్కర్లు, సూపర్‌వైజర్లు గ్రామాల్లో పర్యటించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

అనపర్తి: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు కెనరా బ్యాంక్ అనపర్తి శాఖ ప్రతినిధులు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. బ్యాంకు సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం పుగలం వెంకటరెడ్డిలు పాఠశాలకు చెందిన ఎస్.రితిక (ఆరో తరగతి), కె.మనోజ్ (ఏడో తరగతిలకు ఒక్కొక్కరికి రూ. 2,500 చొప్పున, కె.హర్షిత (ఎనిమిదో తరగతి), బి.లిఖిత(తొమ్మిదో తరగతి), కె.తులసి సరస్వతి (పదో తరగతి)లకు ఒక్కొక్కరికీ రూ. 5 వేల చొప్పున ఇచ్చారు. పాఠశాల హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రతిభ

రంగంపేట: గుంటూరు జిల్లా తాడేపల్లి కేఎల్ విశ్వ విద్యాలయంలో నవంబర్ 29, 30 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలల జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎం.ఆశిక రాష్ట్ర స్థాయి ఉత్తమ బహుమతి సాధించినట్టు జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జిల్లా నుంచి పాల్గొన్న ఏడు ప్రదర్శనల్లో ఆశిక ఉత్తమ బహుమతి కైవసం చేసుకుందన్నారు. 'ఎకో ఫ్రెండ్లీ సానిటరీ నాప్కిన్స్' ప్రదర్శనకు కేవీ రావు సైంటిఫిక్ సొసైటీ అండ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అవార్డు అందుకుందన్నారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

పెదపూడి: తనపై తమ కోడలు, కుమారుడు దాడి చేశారంటూ పెదపూడికి చెందిన వి.రాఘవమ్మ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామంలో తనకు కొద్దిపాటి వ్యవసాయ భూమి ఉందని, అది కొడుకు పేరు మీద రాయాలని పలుమార్లు కోరి దాడికి పాల్పడినట్లు ఆమె చెప్పింది. ఈ నేపథ్యంలో గతంలో కొడుకు వీర్రాజు, కోడలు కుమారి, రాఘవమ్మ ఒకరిపై మరొకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో కేసు ఉండగా తిరిగి తనపై గత నెల 30న దాడికి పాల్పడినట్లు రాఘవమ్మ చెబుతోంది.

వివాహిత అదృశ్యం

గోకవరం: గోకవరానికి చెందిన గుడిసె మేరీ సుశీల అనే వివాహిత గత నెల 27న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇప్పటి వరకు బంధువులు, తెలిసిన వారి ఇంటి వద్ద ఆచూకీ కోసం గాలించినా లభ్యం కాకపోవడంతో ఆమె భర్త అబ్బులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 94409 04830 నంబర్‌కు సమాచారం అందించాలని ఏఎస్సై రాంబాబు నాయక్ కోరారు.

దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

మధురపూడి: కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో జరిగిన దాడిలో గాయపడిన పురుగుల చిన్నయ్య కాకినాడ జీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. కోరుకొండ పోలీసు స్టేషన్ ఎస్సై కట్టా శారదా సతీష్ శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి పుట్టినరోజు వేడుకల్లో మద్యం మత్తులో బేదంపూడి కొండబాబు.. పురుగుల చిన్నయ్యపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు 108లో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు.

అదృశ్యంపై కేసు

గోకవరం: సీతానగరం మండలం వంగలపూడికి చెందిన నల్లల సూరిబాబు గత నెల 30న తాపీ పనికి గోకవరం మండలం తిరుమలాయపాలెం వచ్చాడు. అదేరోజు పని ముగించుకుని రాజమహేంద్రవరం వెళతానని చెప్పి తిరిగి రాలేదు. అతను తన సొంతింటికి కూడా రాకపోవడంతో అతని కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ శ్రీనివాస్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సూరిబాబు ఆచూకీ తెలిసిన వారు 94409 04830 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన శుక్రవారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీవో కె.రమేష్ మాట్లాడుతూ మండలంలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. ఎంఈవో కె.స్వామినాయక్ మాట్లాడుతూ నాడు – నేడులో పూర్తి కావాల్సిన పనులను వెంటనే చేస్తామన్నారు. ఏపీవో కె.సూర్య రమేష్ మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేశామని, సంచులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఏమైనా ఇబ్బందులు కలిగితే రైతులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో పనులు పూర్తి చేసి తాగునీటిని అందిస్తామన్నారు. ఏపీఎం మహాలక్ష్మి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ డ్వాక్రా మహిళలు స్త్రీనిధిని ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యుత్‌శాఖ ఏఈ చంద్రమోహన్ మాట్లాడుతూ మండలంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు పూర్తి కావస్తున్నాయన్నారు. మిర్తిపాడు ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి మాట్లాడుతూ మండలంలో సారా నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ మండలంలో 13 వేల మందికి జగనన్న సురక్ష కార్యక్రమంలో వైద్యసేవలు అందించామని తెలిపారు. తహసీల్దార్ కృష్ణారావు, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముదునూరి సురేష్‌రాజు, సత్యం మదన్‌బాబు, ఏవో గోపాల్, సీనియర్ అసిస్టెంట్ విజయ్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ భరణి కుమార్, వివిధశాఖాధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర'


పెదపూడిలో సచివాలయ కార్యదర్శి ప్రసన్నకుమార్‌కు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంపీపీ తులసి

పెదపూడి: ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని ఎంపీపీ కేతా తులసి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన క్రీడా సామగ్రిని సచివాలయ కార్యదర్శులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా జగనన్న ప్రభుత్వం అతి పెద్ద స్పోర్ట్స్ టోర్నమెంట్ నిర్వహిస్తుందన్నారు. తద్వారా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ క్రీడాకారులు సత్తా చాటే అవకాశం ఏర్పడుతుందన్నారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలు ఉంటాయన్నారు. అందరిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఎంపీడీఓ వీవీ సాయిబాబు, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంఈఓలు వెంకటేశ్వరరావు, సీహెచ్ సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని వెలికితీసేందుకే..

బిక్కవోలు: యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలను 15 ఏళ్ల పైబడిన యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రికెట్, వాలీబాల్ , బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో తదితర పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు


పెదపూడి సభలో మాట్లాడుతున్న ఎంపీపీ తులసి


కొమరిపాలెంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు


పెదపర్తిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించిన సత్తి రామకృష్ణారెడ్డి


గుమ్మళ్లదొడ్డిలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

పెదపూడి: జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు వచ్చాయని ఎంపీపీ కేతా తులసి అన్నారు. శుక్రవారం పెదపూడిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ ఎం.సత్యనారాయణ రెడ్డి నిర్వహించారు. స్థానిక సచివాలయం వద్ద సంక్షేమ, అభివృద్ధి పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రజాప్రతినిధులు, అధికారులు ఆవిష్కరించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, మండల బీసీ సెల్ కన్వీనర్ పప్పు సింహాచలం, రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పథకాలు అమలు కావాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ అన్నారు. కొమరిపాలెం సచివాలయం–2 వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, పార్టీ జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలుద్దాం

అనపర్తి: కుల, మత, రాజకీయాలకు అతీతంగా పారదర్శక పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. పెడపర్తిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం పార్టీ జెండాను, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ అమ్మిరెడ్డి, తమలంపూడి మణి, చిర్ల వీర్రాఘవరెడ్డి, సత్తి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రంగంపేట: గ్రామ స్వరాజ్యం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమైందని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. సుభద్రంపేట సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ కూటి సాయితాతారావు ఆధ్వర్యంలో సభ జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. పార్టీ జెండాను మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, మేడిశెట్టి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు :ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామంలో పార్టీ జెండాను ఎగుర వేశారు. స్థానిక సచివాలయంలో సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారుల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. పలువురికి కొండపోడుకు పత్రాలను, ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో తిరిగి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, గుమ్మళ్లదొడ్డి సర్పంచ్ సరకణం రామలక్ష్మి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, పి.చిన్ని, చక్కిడాల పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సింగవరంలో కొనసాగిన గడప గడపకూ..


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజా

సీతానగరం: గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. మండలంలోని సింగవరంలో శుక్రవారం రెండవ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన గురువారం రాత్రి నాగరత్నం కాలనీలో పల్లెనిద్ర చేశారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రంలో ప్రతి గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సింగవరంలో రూ.3.59 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు గ్రామంలో 3,682 మందికి రూ 9.79 కోట్లను వివిధ సంక్షేమ పథకాల రూపంలో అందజేశామన్నారు. కొన్నిచోట్ల డ్రైన్లు, రోడ్లను ప్రజలు అడుగుతున్నారని, వాటిని కూడా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం సంబంధిత అధికారులతో చర్చించి, నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, ఎంపీటీసీ కొమ్మిరిశెట్టి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు గద్దె వెంకట కృష్ణచౌదరి, చల్లమళ్ల సుజీరాజు, చిర్ల పోశియ్య, మట్ట శ్రీను, అంబటి రమణ, పరిమి వీర్రాజు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అద్భుత ప్రగతి

- సీఎం జగన్‌తోనే అది సాధ్యం
- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


దొంతమూరులో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అద్భుత ప్రగతి సాధించిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం దొంతమూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో అందించిన లబ్ధిపై బుక్‌లెట్‌లను అందజేశారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అన్నారు. ప్రతి ఇంట్లో ప్రభుత్వం నుంచి అందుతున్న వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు ఉన్నారన్నారు. గ్రామాల్లోని చిన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించేందుకు ప్రజల వద్దకే తమ ప్రభుత్వం వస్తుందన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయని వివరించారు. సర్పంచ్ గోలి రమణ, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పార్టీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు గోలి వెంకటకృష్ణ, పార్టీ కన్వీనర్ చెక్కపల్లి నాని, నాయకులు కొల్లాటి ఇజ్రాయేల్, పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే ఎయిడ్స్ నివారణ


రాజానగరంలో మానవహారంగా ఏర్పడిన వైద్య విద్యార్థులు


అనపర్తిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీబీఆర్ నర్సింగ్ విద్యార్థినులు

అనపర్తి: ప్రజా చైతన్యంతోనే ఎయిడ్స్ వ్యాధిని నివారించవచ్చని స్థానిక జీబీఆర్ నర్సింగ్ కళాశాల డైరెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక పాతవూరు జీబీఆర్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ హెచ్‌ఐవీ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు.

గోకవరం: గోకవరంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి దేవీచౌక్ వరకూ ర్యాలీ చేశారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిబ్బంది రమ్య, అనూష, పవన్, రమణ, నాగలక్ష్మి, సూర్య శివాజీ, అబ్రహాం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజానగరం: ఎయిడ్స్‌పై సమాజంలో ఉన్న న్యూనతాభావాన్ని తొలగించేందుకు కృషి చేయాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక జీఎస్ఎల్ చరక ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. జీఎస్ఎల్ వైద్య కళాశాల మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ ఇన్ఫెక్షన్ ఎయిడ్స్‌గా మారిన ప్రస్తుత సమయంలో హెచ్‌ఐవీ సోకిన వారు చికిత్సలు, థెరపీల ద్వారా తమ జీవన కాలాన్నీ క్వాలిటీతో పొడిగించుకోవచ్చన్నారు. తొలుత జీఎస్ఎల్ వైద్య కళాశాల, ఆస్పత్రిలోని డిపార్టుమెంట్ ఆఫ్ డెర్మటాలజీ, వెనీరాలజీ, లెప్రసీ విభాగాల ఆధ్వర్యంలో జీఎస్ఎల్ నుంచి రాజానగరం వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడలిలో మానవ హారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ నర్సింగ్ కాలేజ్ పీఏ, ప్రిన్సిపాల్ గీతా ప్రవీణ, ప్రొఫెసర్లు జి.వెంకట రమణ, వీవీవీ సత్యనారాయణ. కె.సుభాషిణి, జీఎస్ఎల్ వైద్య కళాశాల, దంత వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గైట్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ కె. వల్లీమాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నారాయణపురం వైద్యులు డాక్టర్ ఎన్‌సి రమేష్, డాక్టర్ ఎన్‌సీ హేమలత మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల ఉన్న అపోహలను తొలగించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు. దివాన్‌చెరువులోని వీజేస్ ఫార్మసీలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు.

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు ఎస్.రాజు, మేఘన ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ కె.ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్లు కె.సుధాకర్, జి.దైవకృప, నందీష్, పుష్ప పాల్గొన్నారు. అలాగే సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో అధ్యాపకులు ఎయిడ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల నుంచి ర్యాలీతో బయలుదేరి నాలుగు బొమ్మల సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ హరేరామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధురపూడి: కోరుకొండ మండలంలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు జరిగాయి. దోసకాయలపల్లి పీహెచ్‌సీ పరిధిలో జరిగిన ర్యాలీలో డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులను ఆదరించాలన్నారు.

రంగంపేట: హెచ్‌ఐవీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు బి.వేణుశ్రీలక్ష్మి, కె.చిన్నారావు అన్నారు. ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం రంగంపేటలో ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. పీహెచ్‌సీ సీహెచ్‌ఓ కె.జయమణి, ఎంపీహెచ్‌ఈఓ పి.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు


సభ్యులను సత్కరించిన అధ్యాపకులు

సీతానగరం: కెరీర్ గైడెన్స్ – డెసిషన్ మేకింగ్ అనే అంశంపై రాజమహేంద్రవరం ఆర్‌టీసీ యూనియన్ బృందం శుక్రవారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సూర్యప్రకాశరావు, శ్రీనివాసరావు, జోసెఫ్, కుమారి, సతీష్ మాట్లాడుతూ ఏపీపీఎస్‌సీ, యూపీఎస్‌ఈ, పోస్టల్, బ్యాంకు, తపాలా, ఎల్‌ఐసీ, కోర్టు మొదలగు ఉద్యోగాలను పొందాలంటే ముందుగా సరైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. సంకల్ప బలంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుధామయి, కెరీర్ గైడెన్స్ కన్వీనర్ ఎస్కే మదీనా అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు విరివిగా చేపట్టాలి

రంగంపేట: ఆయిల్‌పామ్ తోటల సాగు విరివిగా చేపట్టాలని పతంజలి డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.రవీంద్ర కోరారు. శుక్రవారం కోటపాడు గ్రామంలో పతంజలి ఫుడ్స్, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఆగస్టు నుంచి ఆయిల్‌పామ్ మొక్కలను పూర్తి శాతం రాయితీతో అందిస్తామన్నారు. పూర్తిగా పక్వానికి వచ్చిన గెలలను మాత్రమే కోసి కలెక్షన్ సెంటర్లకు అందించాలని తెలిపారు. ఉద్యాన అధికారి కె.దివ్యశ్రీ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు పద్ధతులను వివరించారు. నాలుగేళ్లకు ఉద్యాన శాఖ ద్వారా హెక్టార్‌కు రూ. 21 వేలు రాయితీ ఇస్తున్నామన్నారు. పతంజలి జూనియర్ మేనేజర్ ఓంకార్ ఆయిల్ పామ్ సాగులో తెగుళ్లు, చీడపీడల నివారణ చర్యలను వివరించారు. ఉద్యాన విస్తరణ అధికారి అరవింద్ సాయి, రంగంపేట క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్‌వీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.